క్లుప్తంగా

నేడు బహిరంగ వేలం

నాంపల్లి : స్థానిక గ్రామ పంచాయతీకి సంబంధించిన 4 దుకాణాల మడిగెలు, తైబజారు బహిరంగ వేలం మంగళవారం ఉదయం 10 గంటలకు గ్రామ పంచాయతీ ఆవరణలో నిర్వహించనున్నట్లు ఎంపీఓ ఝాన్సీ సోమవారం ప్రకటనలో తెలిపారు. దుకాణాల మడిగెలు, తైబజారుకు వేర్వేరుగా రూ.5000 గ్రామ పంచాయతీకి చెల్లించి రశీదు పొందిన వారు మాత్రమే బహిరంగ వేలంలో పాల్గొనాలని తెలిపారు. తైబజారుకు రూ.లక్షా 45వేలు, 1 నుంచి 3 వరకు ఉన్న దుకాణాలు ఒక్కొక్కటి చొప్పున రూ.18వేలు, 4వ దుకాణం రూ.12వేల చొప్పున వేలం ఉంటుందన్నారు.

శ్రీరామ నవమికి ఏర్పాట్లు చేయాలని వినతి

నల్లగొండ టూటౌన్ : శ్రీరామ నవమి పండుగ సందర్భంగా నీలగిరి పట్టణంలోని అన్ని ఆలయాల్లో భక్తులకు తగిన ఏర్పాట్లు చేయాలని కోరుతూ బీజేపీ నాయకులు సోమవారం మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి, బీజేపీ పట్టణ అధ్యక్షుడు మిర్యాల వెంకటేశం, గోలి మధుసూదన్‌రెడ్డి, పోతెపాక లింగస్వామి, కంచర్ల విద్యాసాగర్‌రెడ్డి, పకీరు మోహన్‌రెడ్డి, చింతా ముత్యాల్‌రావు తదితరులు ఉన్నారు.

మీ సేవ కేంద్రాలు తనిఖీ చేయాలని..

నకిరేకల్ : పట్టణంలోని మీసేవ కేంద్రాలను తనిఖీ చేయాలని కోరుతూ అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో శనివారం నకిరేకల్ తహసీల్దార్ జమురుద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. అధిక చార్జీలు వసూలు చేస్తున్న మీ సేవ కేంద్రాల లైసెన్సులు రద్దు చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు పల్స శ్రీనివాస్‌గౌడ్, టీడీపీ నాయకుడు యాతాకుల అంజయ్య, కాశీరాం, వంటెపాక జమదగ్ని, సైదులు, అంజయ్య, వేణు, నాగరాజు, రవి తదితరులు ఉన్నారు.

బార్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

నకిరేకల్ : పట్టణంలోని మున్సిఫ్ కోర్టు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీనియర్ న్యాయవాది పూజర్ల శంభయ్య మూడోసారి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా పులి పాపయ్య, జనరల్ సెక్రటరీగా డి.సోమయ్య, జాయింట్ సెక్రటరీగా పి.మీరామనోహర్, ట్రెజరర్‌గా సీహెచ్ నాగరాజు, స్పోర్ట్స్, కల్చరల్ సెక్రటరీగా పి.మురళీకృష్ణ, లైబ్రరీ సెక్రటరీగా వి.వెంకటరమణ, ఎగ్జిక్యూటివ్ అడ్వయిజర్లుగా కె.సంతోష్, వి.వెంకన్న, ఇ.ఉదయ్‌కుమార్, ఎం.రమేష్‌లు ఎన్నికయ్యారు.

సంక్షేమ బోర్డులో ప్రాధాన్యం కల్పించాలి

మునుగోడు: భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ బోర్డులో ప్రాధాన్యత కల్పించాలని ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లా దేవేందర్‌రెడ్డి కోరారు. సోమవారం మునుగోడులో జరిగిన భవన నిర్మాణ కార్మిక సంఘం మండల 11వ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షుడు చాపల శ్రీను, మండల కార్యదర్శి దుబ్బ వెంకన్న, కార్యదర్శి బెల్లం శివయ్య, ఈద యాదయ్య, పందుల నర్సింహ, మేకల కృష్ణయ్య, ఈద రాములు, జీడిమడ్ల శివ తదితరులు పాల్గొన్నారు.

టీవీ బహూకరణ

రామగిరి(నల్లగొండ): నల్లగొండ మండలం అప్పాజిపేట ప్రాథమిక పాఠశాలలో గత సంవత్సరం రిటైర్డ్ అయిన ఉపాధ్యాయురాలు రమాదేవి రూ.80 వేల విలువైన స్మార్ట్ టీవీని సోమవారం పాఠశాలకు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మాలతి, శ్రీనివాస్, ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు సాయి ఫణీంద్ర, హరీష్, మౌనిక పాల్గొన్నారు.

ఆలయానికి ఫ్రిజ్..

చిట్యాల: మండలంలోని మొర్సుగూడెం గ్రామంలో గల శ్రీ పార్వతి రామలింగేశ్వర స్వామి ఆలయ 26వ వార్షికోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సోమవారం శ్రీ పార్వతి రామలింగేశ్వర స్వామి కల్యాణోత్సవం ఆలయ అర్చకులు నాగార్జున, సత్యనారాయణశర్మ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి ఆ గ్రామానికి చెందిన బెల్లంకొండ లింగస్వామి-రమణ దంపతులు ఫ్రిజ్ బహూకరించారు.

విద్యార్థులు జాతీయ స్థాయిలో రాణించాలి



విద్యార్థులతో ఎస్పీ శరత్ చంద్ర పవార్

నల్లగొండ టూటౌన్ : నిరంతర సాధన, పట్టుదల, క్రమశిక్షణతో తైక్వాండో క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలని ఎస్పీ శరత్ చంద్ర పవార్ అన్నారు. నల్లగొండ పట్టణంలో సన్‌లైట్ తైక్వాండో అకాడమిలో శిక్షణ పొంది బ్లాక్ బెల్ట్ అర్హత సాధించిన క్రీడాకారులకు సోమవారం ఎస్పీ సర్టిఫికెట్లు అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో తైక్వాండో అసోసియేషన్ జిల్లా సెక్రటరీ చింత అనిల్‌కుమార్, క్రీడాకారులు ఎం. శివరామాంజనేయం, ఎం.పూర్ణచందు, ఉమేష్‌చంద్ర, దత్తు, సమర సింహారెడ్డి, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కష్టాలు తీరేనా!

- ఐదు బోర్లు ఉన్నా ఫలితం శూన్యం
- పర్యవేక్షణ లోపంతో పూర్తిస్థాయిలో అందని మిషన్ భగీరథ నీరు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న శాలిగౌరారం ప్రజలు



శాలిగౌరారంలో ఎండిపోయిన తాగునీటి బోరు

శాలిగౌరారం: పేరుకు మండల కేంద్రం.. కానీ మంచినీరు కరువు.. సంవత్సర కాలంగా తాగునీటి కోసం ప్రజలు అవస్థలు పడుతున్నా పట్టించుకునే వారే లేకుండా పోయారు.. ఇదీ శాలిగౌరారం మండల కేంద్రం పరిస్థితి. శాలిగౌరారం మండల కేంద్రంలో సంవత్సర కాలంగా ప్రజలు అడపాదడపా వచ్చే గ్రామపంచాయతీ బోరునీరు, మిషన్ భగీరథ తాగునీటితోనే కాలం వెళ్లదీసుకుంటున్నారు. శాలిగౌరారం గ్రామంలో మిషన్ భగీరథ నీటిని అధికారులు సక్రమంగా సరఫరా చేయడం లేదు. పర్యవేక్షణ లేకపోవడంతో మిషన్ భగీరథ నీరు పైప్‌లైన్ చివరన ఉన్న కాలనీలు అందడం లేదు.

అందని తాగునీరు

శాలిగౌరారం మండల కేంద్రంలోని వ్యాపార దుకాణాలు, నివాస గృహాలు, బీసీ కాలనీతోపాటూ ప్రభుత్వ కార్యాలయాలకు తాగునీటిని అందించేందుకు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఐదు తాగునీటి బోర్లు ఉన్నాయి. అందులో మసీదు సమీపంలో ఉన్న బోరు పూర్తిగా ఎండిపోయింది. ఈ బోరు ద్వారానే మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలతోపాటూ పోలీస్‌స్టేషన్‌కు కూడా నీటి సరఫరా జరుగుతుండేది. దీనికితోడు పైపులైన్‌కు కాలం చెల్లడంతో పైపులైన్ పూర్తిగా ధ్వంసమైంది. బీసీ కాలనీకి తాగునీటిని అందించే బోరుమోటారు ఆగి ఆగి పోయడంతో సరిపడా నీరు అందడం లేదు. మండల కేంద్రంలో మెయిన్ రోడ్డు వెంట పల్లె ప్రకృతివనం సమీపంలోని బోరుమోటారు కాలిపోయింది. దీంతో మెయిన్ రోడ్డు వెంట ఉన్న ఇళ్లకు నీటి సరఫరా నిలిచిపోయింది. అదేవిధంగా తహసీల్దార్ కార్యాలయం వెనుక ఉన్న బోరుమోటారుకు త్రిఫేజ్ విద్యుత్ లైన్ లేకపోవడంతో ఆ బోరు నిరుపయోగంగానే మారింది.

నిధులు మంజూరైనా..

మండల కేంద్రానికి తాగునీటిని అందించే గ్రామపంచాయతీ బోరు ఎండిపోవడంతో ఎంపీ నిధుల నుంచి జనవరిలో రూ.2 లక్షల వ్యయంతో నూతనంగా బోరువేసి మోటారు బిగించారు. కానీ ఆ మోటారు కూడా ఆగి పోస్తుండడంతో నేటికి పైపులైన్ వేయలేదు. నూతన పైపులైన్ నిర్మాణానికి మండల పరిషత్ అభివృద్ధి నిధుల నుంచి రూ. 3 లక్షలు మంజూరయ్యాయి. కానీ పైపులైన్ నిర్మాణ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవడంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

అవస్థలు తప్పడం లేదు



సంవత్సర కాలంగా గ్రామ పంచాయతీకి సంబంధించిన బోరు నుంచి నీటి సరఫరా నిలిచిపోయింది. ఇళ్లలో వినియోగానికి సరిపడా నీరు లేకపోవడంతో అవస్థలు పడుతున్నాం. పండుగలు, శుభకార్యాల సమయంలో అయితే మా బాధలు వర్ణనాతీతం. వచ్చే కొద్దిపాటి నీటిని పొదుపుగా వాడుకుంటూ కాలం వెళ్లదీస్తున్నాం.

–గోదల వెంకట్‌రెడ్డి, మెయిన్‌రోడ్డు, శాలిగౌరారం

నీటిని సరిపడా అందించాలి



మా కాలనీకి తాగునీటిని అందించే గ్రామపంచాయతీ బోరుమోటారు ఆగిపోస్తుండడంతో ఇళ్లలోకి నాలుగు రోజులుగా నీళ్లు వస్తలేవు. మిషన్ భగీరథ తాగునీరు ఇంట్లో తాగేందుకు కూడా సరిపోవడం లేదు. మిషన్ భగీరథ నీటిని రెండు విడతలుగా సరిపడా విడుదల చేసి నీటి సమస్యను తీర్చాలి.

–వేముల లక్ష్మి, బీసీ కాలనీ, శాలిగౌరారం

ప్రతిపాదనలు పంపాం



మండల కేంద్రంలో తాగునీటిని సమస్య ఏర్పడిన విషయం వాస్తవమే. అద్దెకు బోర్లను తీసుకునేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. అనుమతులు రాగానే బోర్లను అద్దెకు తీసుకుంటాం. రెండురోజుల క్రితం మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ కావడంతో తాగునీరు అందలేదు. మంగళవారం నుంచి తాగునీటి సరఫరా జరుగుతుంది.

–రాంబాబు, మిషన్ భగీరథ (ఇంట్రా) ఏఈ, శాలిగౌరారం మండలం

మౌలిక వసతుల కల్పనే ధ్యేయం

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

కట్టంగూర్ : గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ ధ్యేయమని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండలంలోని పామనగుండ్ల గ్రామంలో సోమవారం ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.15 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. అధిక నిధులు తీసుకొచ్చి నియోజకవర్గ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో నకిరేకల్ మార్కెట్ కమిటీ చైర్మన్ గుత్తా మంజుల మాధవరెడ్డి, ఎంపీడీఓ జ్ఞానప్రకాశ్‌రావు, మాజీ జెడ్పీటీసీలు సుంకరబోయిన నర్సింహ, మాద యాదగిరి, రెడ్డిపల్లి సాగర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండారు కృష్ణ, జీపీ కార్యదర్శి జయసుధ, నాయకులు కొరివి యాదగిరి, కుంభం అనిల్‌రెడ్డి, కనుకుల ధర్మారెడ్డి, మిట్టపల్లి శివ, మర్రి రాజు, రెడ్డిపల్లి వీరస్వామి పాల్గొన్నారు.

నీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోండి



మాట్లాడుతున్న డీపీఓ కె వెంకయ్య

కట్టంగూర్ : వేసవిలో మంచినీటి సమస్య తలెత్తకుండా సంబంధిత అధికారులు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి వి వెంకయ్య సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో మంచినీటి సమస్య, ఇంటి పన్ను వసూళ్లు, శానిటేషన్‌పై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. భూగర్భజలాలు అడుగంటిపోతున్న తరుణంలో రాబోయే రెండు నెలలకు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. రిపేరులో ఉన్న బోర్లకు వెంటనే మరమ్మతులు చేపట్టి మంచినీటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైతే రైతుల నుంచి బోర్లు అద్దెకు తీసుకుని మంచినీటి సరఫరా చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి పి.కోటేశ్వర్‌రావు, ఎంపీడీఓ జ్ఞానప్రకాశ్‌రావు, ఎంపీఓ చింతమల్ల చలపతి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అశోక్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

ప్రతి కూలీకి ఉపాధి హామీ పని కల్పించాలి



ఓపెన్ ఫోరంలో పాల్గొన్న నవీన్‌కుమార్

నాంపల్లి : గ్రామాల్లో ప్రతి కూలీకి ఉపాధి హామీ పనులు కల్పించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అదనపు అధికారి నవీన్‌కుమార్ అన్నారు. నాంపల్లి మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం ఆవరణలో సోమవారం నిర్వహించిన ఉపాధి హామీ ఓపెన్ ఫోరంకు ఆయన హాజరై మాట్లాడారు. 1 ఏప్రిల్ 2023 నుంచి 31 మార్చి 2024 వరకు జరిగిన ఉపాధి హామీ పనులపై సామాజి తనిఖీ నిర్వహించారు. మండల వ్యాప్తంగా 418 పనులకు గాను రూ.2,53,34,735 విలువైన పనులు చేశారు. ఈ సందర్భంగా నవీన్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి కూలీకి రూ.300 వేతనం వచ్చేవిధంగా పనులు చేయించాలని సిబ్బందికి సూచించారు. జూన్ నెల వరకు మొక్కలు నాటేందుకు నర్సరీల్లో మొక్కలు అందుబాటులో ఉండాలన్నారు. పని ప్రదేశాల్లో నీరు, టెంట్లు తప్పకుండా ఉండేలా అధికారులు చూడాలన్నారు. కూలీలకు పనులు కల్పించడంలో జాప్యం చేస్తే వేటు తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో దేవరకొండ ఏపీడీ యామిని, ఎంపీడీఓ రామకృష్ణశర్మ, జిల్లా విజిలెన్స్ అధికారి వేణుగోపాల్‌రావు, ఎంపీఓ ఝాన్సీ, ఏపీఓ వెంకటేశం, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆడబిడ్డల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి



చెక్కు అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

మునుగోడు: రాష్ట్రంలో ఆడబిడ్డల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని 86 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను మునుగోడు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ ప్రభుత్వం ఆడబిడ్డలకు ఇచ్చిన ప్రతి హామీని దశలవారీగా అమలు చేస్తోందన్నారు. ఇప్పటికే ఉచిత బస్సు సౌకర్యం, కల్యాణలక్ష్మి, రూ.500లకే గ్యాస్ అందిస్తున్నామన్నారు. అతిత్వరలో ప్రతి రేషన్ కార్డుదారుడికి సన్న బియ్యం అందిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.నరేందర్, చండూరు మార్కెట్ చైర్మన్ దోటి నారాయణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాల్వాయి చెన్నారెడ్డి, మాజీ ఎంపీపీ కర్నాటి స్వామి, మాజీ సర్పంచ్‌లు మిర్యాల వెంకన్న, జాల వెంకన్న యాదవ్, మాదగోని రాజేష్ గౌడ్, తాటికొండ సైదులు, నాయకులు గోపగోని పాపయ్య, ఆరేళ్ల సైదులు, సాగర్ల లింగస్వామి పాల్గొన్నారు.

క్షయ రహిత భారత్‌గా తీర్చిదిద్దుదాం



నకిరేకల్ : ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యసిబ్బంది

నార్కట్‌పల్లి : క్షయ రహిత భారత్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని నార్కట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం క్షయ వ్యాధి నివారణ దినోత్సవంలో భాగంగా బడుగు రామస్వామి-కమలమ్మ ఫౌండేషన్ సౌజన్యంతో స్థానిక పీహెచ్‌సీలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముందుగా ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో పట్టణంలోని భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సిబ్బందితో క్షయ వ్యాధిని నివారిద్దాం అని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా క్షయ వ్యాధిపై సిబ్బందికి జనరల్ నాలెడ్జ్ టెస్ట్ నిర్వహించి ప్రతిభ కనబర్చినవారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామస్వామి, ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బడుగు శ్రీరాములు, పర్యవేక్షకులు అజయ్‌కుమార్, మధుసూదన్, చంద్రకళ, వెంకటమ్మ, ఆయుష్ మెడికల్ ఆఫీసర్ సల్మా సుల్తానా, టెక్నికల్ అసిస్టెంట్లు సైదులు, యాదగిరి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నివారణపై ర్యాలీ

నకిరేకల్ : ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా నకిరేకల్ ఓగోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం వైద్య సిబ్బంది నకిరేకల్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. వైద్యాధికారి డాక్టర్ యోగస్వీ, విస్తరణ అధికారి విశ్వనాథుల నర్సింహాచారి, టీబీ సూపర్‌వైజర్ యాసారపు రామకృష్ణ, హెల్త్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మీ, సుధాకర్‌రెడ్డి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

శాలిగౌరారం: క్షయ నిర్మూలన దినోత్సవం సందర్భంగా పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి శ్వేత, పీహెచ్‌సీ వైద్యులు వెంకటేశ్, వాసవి, పీహెచ్‌ఎస్ రాములమ్మ, సూపర్‌వైజర్ దయామని, నోడల్ పర్సన్ భాస్కర్, వెంకటనారాయణ, ఏఎన్‌ఎంలు సిబ్బంది పాల్గొన్నారు.

నేటి వరకు నీటి సరఫరా నిలిపివేత

కేతేపల్లి: పానగల్ ఉదయ సముద్రం రిజర్వాయర్ నుంచి కేతేపల్లి మండలానికి మిషన్ భగీరథ తాగునీటిని సరఫరా చేసే ప్రధాన పైప్‌లైన్ లీకేజీలకు మరమతులు చేస్తున్న కారణంగా ఈ నెల 25 వరకు నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లో ప్రజలకు తాగునీటిని అందించేందుకు పంచాయతీ కార్యదర్శులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

ఆర్థికసాయం అందజేత

నాంపల్లి : మండలంలోని పసునూర్ గ్రామానికి చెందిన పంబాల శంకరమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. బాధిత కుటుంబాన్ని మాజీ జెడ్పీటీసీ ఎలుగోటి వెంకటేశ్వర్‌రెడ్డి సోమవారం పరామర్శించి రూ.20వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట నక్క చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ సల్వాది రాములు శేఖర్ తదితరులు ఉన్నారు.

26న ధర్నా

గట్టుప్పల్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 26న మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బండ శ్రీశైలం కోరారు. సోమవారం గట్టుప్పల్‌లో మండల కమిటీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కర్నాటి మల్లేశం, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మహిళలకు రాయితీపై వ్యవసాయ పనిముట్లు

నకిరేకల్ : వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా మహిళా రైతులకు ఎస్‌ఎంఎం పథకం 2024-25 ద్వారా 50 శాతం రాయితీపై ట్రాక్టర్‌కు సంబంధించిన వ్యవసాయ పనిముట్లు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి మహ్మద్ జానిమియా తెలిపారు. పట్టాదారు పాసు బుక్ మహిళా రైతుల పేరు మీద ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల మహిళా రైతులు పాస్ బుక్, ఆధార్ కార్డు జిరాక్స్, ట్రాక్టర్ ఆర్సీ జిరాక్స్ ప్రతులు, పాస్ ఫొటోలతో ఈ నెల 26వ తేదీలోపు నకిరేకల్ మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

చిట్యాల: మహిళా రైతులకు ఎస్‌ఎంఏఎం(సబ్ మిషన్ ఆన్ అగ్రికల్చర్ మెకానిజేషన్) పథకం ద్వారా యాభై శాతం సబ్సిడీపై వ్యవసాయ యంత్ర పరికరాలు అందించనున్నట్లు చిట్యాల మండల వ్యవసాయ అధికారి పగిడిమర్రి గిరిబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులకు ఈ నెల 26 చివరి తేదీ అని పేర్కొన్నారు.

నార్కట్‌పల్లి : మహిళా రైతులకు 50 శాతం రాయితీపై పనిముట్లు ఇవ్వనున్నట్లు నార్కట్‌పల్లి వ్యవసాయ శాఖ అధికారి గౌతమ్ తెలిపారు. సోమవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

కట్టంగూర్ : మహిళా రైతులకు ఎస్‌ఎంఏఎం పథకం ద్వారా 50 శాతం రాయితీపై వ్యవసాయ పనిముట్లు ఇవ్వనున్నట్లు మండల వ్యవసాయ అధికారి వై.గిరిప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26 లోపు కట్టంగూర్ రైతు వేదికలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కేతేపల్లి: రాయితీపై వ్యవసాయ పనిముట్లకు మండలంలోని మహిళా రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఏఓ బి.పురుషోత్తం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26లోగా దరఖాస్తులను మండ వ్యవసాయ శాఖ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

పరీక్ష పత్రం లీకేజీపై విమర్శలు తగవు



ఫిర్యాదు చేస్తున్న నకిరేకంటి నరేందర్, మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజిత

నకిరేకల్ : పదో తరగతి పరీక్ష పత్రం లీకేజీ వ్యవహారంపై పోలీసులు చట్టపరంగా వ్యవహరిస్తారని, ఈ విషయంలో అధికార పార్టీ నేతలపై విమర్శలు చేయడం సరైంది కాదని నకిరేకల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ గుత్తా మంజుల, మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజితా శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యేపై, మున్సిపల్ చైర్ పర్సన్‌పై అసత్య ఆరోపణలు చేయడం సరైంది కాదన్నారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ నాగులంచ వెంకటేశ్వరరావు, నాయకులు లింగాల వెంకన్న, గాజుల సుకన్య, గాదగోని కొండయ్య, కొండ వెంకన్నగౌడ్, పన్నాల శ్రీనివాస్‌రెడ్డి, రాచకొండ సునీల్, యాసారపు వెంకన్న, బానోతు వెంకన్న, చౌగోని లక్ష్మణ్, పోతుల రవి, మట్టిపల్లి వీరు, గడ్డం స్వామి పాల్గొన్నారు.

పోలీసులకు ఫిర్యాదు

పేపర్ లీకేజీ విషయంలో తమపై ఆరోపణలు చేసిన కొన్ని యూట్యూబ్ చానల్స్, ఒక టీవీ చానల్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం రాత్రి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ లచ్చిరెడ్డికి మర్రూర్ మాజీ సర్పంచ్ నకిరేకంటి నరేందర్ ఫిర్యాదు చేశారు. ఆయన వెంట స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజితా శ్రీనివాస్‌గౌడ్, యాసారపు వెంకన్న ఉన్నారు.

పేపర్ లీకేజీలో రాజకీయ ప్రమేయం లేదు : ఎంఈఓ

నకిరేకల్ : పట్టణంలోని సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలలో పేపర్ లీకేజీ వ్యవహారంలో ఎలాంటి రాజకీయ ప్రమేయం లేదని, ఈ సంఘటన కేవలం మాల్ ప్రాక్టీస్‌గా పరిగణించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని ఎంఈఓ మేకల నాగయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడినందుకు సంబంధిత విద్యార్థినిపై నకిరేకల్ పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టామని పేర్కొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

శాలిగౌరారం: మండలంలోని మాధారంకలాన్ గ్రామంలో బోడ సైదులు ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 54.50 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అండ్ పౌర సరఫరాల శాఖ అధికారులు సంయుక్తంగా దాడులు చేసి పట్టుకున్నారు. స్థానికులు అందించిన పక్కా సమాచారంతో దాడులు నిర్వహించినట్లు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ గౌస్, నకిరేకల్ డీటీసీఎస్ జ్యోతి తెలిపారు. బోడ సైదులుపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. రేషన్ బియ్యం అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా



రామగిరి(నల్లగొండ): ధర్నా చేస్తున్న నాయకులు

రామగిరి(నల్లగొండ): నీటి ఎద్దడి కారణంగా పంటలు ఎండిపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సీపీఎం నాయకులు నల్లగొండ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ తన్వితకు వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నాగార్జున పాల్గొని మాట్లాడుతూ ఇటీవల కాలంలో నీటి ఎద్దడి కారణంగా నల్లగొండ మండలంలో సుమారు 2003 ఎకరాల వరి పంట ఎండిపోయిందన్నారు. ఎకరాకు రూ.30 వేల చొప్పున రైతులకు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు కొండ అనురాధ మండల కమిటీ సభ్యులు సత్యనారాయణ, వెంకన్న, జిల్లా అంజయ్య, బొల్లు రవీందర్‌కుమార్, గోలి నరసింహ, కట్ట అంజయ్య, ముక్కామల యాదయ్య, రాములు, చారి తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల: ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య విమర్శించారు. గ్రామాల్లో నెలకొన్న ప్రజల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో చిట్యాల తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం నిర్వహించిన ధర్నాలో వారు పాల్గొని మాట్లాడారు. నీరు లేక ఎండిపోయిన పంటలకు గాను రైతులకు నష్ట పరిహారాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు జిట్ట సరోజ, మాజీ జెడ్పీటీసీ పామనగుళ్ళ అచ్చాలు, మండల సహాయ కార్యదర్శి కత్తుల లింగస్వామి, అర్రూరి శ్రీను, బొబ్బలి సుధాకర్‌రెడ్డి, ఐతరాజు నర్సింహ, పంది నరేష్, లడే రాములు, నాతి వెంకట్రామయ్య, అర్రూరి శంభయ్య, మామిడి రాములు, దేశబోయిన సరస్వతి, నర్సింహ, కోనేటి రాములు, సుర్కంటి మోహన్ రెడ్డి, బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

వార్డుల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలి



వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

నల్లగొండ టూటౌన్ : వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ శివారు కాలనీల్లో డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేక మురుగు నీటితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వీధి లైట్లు కూడా సరిగ్గా వెలగడంలేదని, కాలనీల్లో సమస్యలు పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. పద్మనగర్‌లో ట్యాక్స్ చెల్లించలేదని పవర్‌లూమ్స్‌కు మున్సిపల్ అధికారులు తాళాలు వేయడం సరికాదన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్‌కు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు మిర్యాల వెంకటేశం, గోలి మధుసూదన్‌రెడ్డి, కంచర్ల విద్యాసాగర్‌రెడ్డి, పోతెపాక లింగస్వామి తదితరులు ఉన్నారు.

అత్యవసర షటర్లు బిగించే పనులు ప్రారంభం

శాలిగౌరారం: శాలిగౌరారం ప్రాజెక్టులోకి వరదనీరు వచ్చేందుకు మూసీనదిపై పల్లివాడ వద్ద ఆనకట్టకు అత్యవసర షట్టర్లు బిగించే పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. పనులను ఇరిగేషన్ ఏఈ రాములు పర్యవేక్షించారు. ఆయన వెంట వర్క్ ఇన్‌స్పెక్టర్ రజినీకాంత్, చామల వెంకటరమణారెడ్డి తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి మంత్రి చేయూత

చిట్యాల: పట్టణంలోని పన్నెండో వార్డుకు చెందిన ఇమ్మడి శ్రవణ్‌కుమార్(49) అనారోగ్యంతో ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. శ్రవణ్‌కుమార్ మృతదేహాన్ని సోమవారం రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.2 లక్షల ఆర్థికసాయం అందజేశారు. మంత్రి వెంట నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, కాంగ్రెస్ నేత మాజీ కార్యదర్శి దైద రవీందర్, మున్సిపల్ మాజీ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, మాజీ కో ఆప్షన్ సభ్యుడు ఇబ్రహీం ఉన్నారు.

మంత్రి పరామర్శ

నల్లగొండ: చిట్యాల మండలం ఏపూరు బీఈసీ కంపెనీలో పనిచేస్తూ అగ్రికల్చర్ నీటి సంపులో ఈతకు వెళ్లి నల్లగొండ మండలం రసూల్‌పురంకు చెందిన చింతపల్లి రాఘవేంద్ర, నలుపరాజు నవీన్‌కుమార్ మృతి చెందారు. వీరి మృతదేహాలను సోమవారం జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని మార్చురీకి తీసుకువచ్చారు. మార్చురీ వద్ద యువకుల మృతదేహాలను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సందర్శించి బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, బుర్రి శ్రీనివాసరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, వంగూరి లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

ఆరు గ్యారంటీలు అమలు చేయాల్సిందే

గట్టుప్పల్ : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలుచేసే వరకు తమ ఉద్యమం ఆగదని బీజేపీ జిల్లా కార్యదర్శి చితలువేరు దుర్గయ్య అన్నారు. సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో గట్టుప్పల్ మండలం వెల్మకన్నె గ్రామంలో ప్రభుత్వ పథకాలకు ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారెంటీల దరఖాస్తులు స్వీకరించి తహసీల్దారుకు, కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు రావుల ఎల్లప్ప అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఓబీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు కంటె దుర్గయ్య, మండల ప్రధాన కార్యదర్శి నాగులగాని శ్రీను, మైల బీరప్ప నీల అంజయ్య, లోగి గౌడ్, గంగాదేవి అనిల్ కుమార్, శీను తదితరులు పాల్గొన్నారు.